క్లుప్తంగా

సీఎంను కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి



మోర్తాడ్: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బాల్కొండ నియోజకవర్గంతో పాటు, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరగా ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళా సమాఖ్య భవనం ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, పాఠశాల అదనపు తరగతి గదులను ఎంపీపీ సుకన్య గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో వనజ, ఎంపీవో సాయిలు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వర్ని(మోస్రా): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో జానకి అన్నారు. మోస్రా మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, తహసీల్దార్ మారుతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, డాక్టర్ విజయకుమార్, ఎంపీడీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

రెంజల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయ, ఎంఈవో గణేశ్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు ఆహ్వానం

బోధన్: పట్టణ కేంద్రంలోని బీటీనగర్ కాలనీలో ఉన్న కోట మైసమ్మ సహిత లక్ష్మి నర్సింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 14న జరుగనున్నాయి. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపికిషన్, పలువురు ప్రతినిధులు జిల్లా కేంద్రంలో కలిసి ఆహ్వానించారు. రెండోసారి ఎంపీ టిక్కెట్ వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల భవితకు పునాదులు వేయాలి

బోధన్: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ఉజ్వల భవితకు ఉపాధ్యాయులు పునాదులు వేయాలని ఎంఈవో నాగ్‌నాథ్ అన్నారు. పట్టణంలోని విజయ సాయి ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం సాగిరాజు కల్పన, విజయ సాయి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ మోహన్, అకాడమిక్ ఇన్‌చార్జి ప్రసూన, రాజశేఖర్, చక్రవర్తి, సువర్చల పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఆర్మూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో నిర్మించిన పలు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి హైదరాబాద్‌లో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. నందిపేట, డొంకేశ్వర్ మండలాల పరిధిలోని నిఖాల్‌పూర్, మారంపల్లి, తల్వేద ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.4.83 కోట్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి నిధుల మంజూరిను పరిశీలిస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతల స్వీకరణ

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం కోసం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్ను గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 11న బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. సమావేశం ఎజెండా అంశాలను కౌన్సిలర్లకు, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. షేక్ మున్ను వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కోటగిరిలో తహసీల్దార్‌ను సన్మానించిన సభ్యులు



ఆర్మూర్ గురుకుల డిగ్రీ కళాశాలలో..



ఆర్మూర్‌లో జడ్జి సుల్తానాకు జ్ఞాపికను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధ్యాయినులు, మహిళా అధికారులు, సిబ్బందిని పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. కళాశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. – సాక్షి, నెట్‌వర్క్

రేపటికి ముందడుగు



కమ్మర్‌పల్లిలో..



ఏర్గట్లలో..



చేపూర్‌లోని క్షత్రియ హైస్కూల్‌లో..



నవీపేటలో..



నందిపేటలో సన్మానించిన పీఆర్టీయూ నాయకులు

కుటుంబ వ్యవస్థకు మహిళలే వెన్నెముక

- బోధన్ కోర్టు ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్



వేడుకల్లో పాల్గొన్న న్యాయమూర్తి, న్యాయవాదులు

బోధన్: కుటుంబ వ్యవస్థ పటిష్టతకు మహిళలు వెన్నెముకగా ఉన్నారని బోధన్ కోర్టు ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్ అన్నారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాదులు మాధవీలత, శ్రీలక్ష్మి, అంకిత, కోర్టు మహిళా ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించారు. సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, అడిషనల్ సివిల్ జూనియర్ జడ్జి శివసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందకుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ శ్యాంరావు, సమ్మయ్య, గవర్నమెంట్ ప్లీడర్ మోహన్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించారు. డాక్టర్ భానుశ్రీ, సమత, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ గురువు.. అంకాపూర్ మహిళలు

- ప్రముఖుల ప్రశంసలు పొందిన ఈ ప్రాంత మహిళ రైతులు
- వ్యవసాయ పనులన్నీ తాము చూసుకొని మార్కెటింగ్ బాధ్యతలు భర్తకు..



ఆర్మూర్ ప్రాంతంలో వ్యవసాయ పనులకు ఎడ్లబండిని తీసుకెళ్తున్న మహిళ రైతు(ఫైల్)

ఆర్మూర్: మేనేజ్‌మెంట్(నిర్వహణ) అన్నది అంకాపూర్ మహిళల నుంచే నేర్చుకోవాలి.. అది కుటుంబ వ్యవహారాలైనా, వ్యవసాయంలోనైనా, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అయినా.. అంటూ పలుమార్లు ప్రముఖుల ప్రశంసలు పొందిన ఆర్మూర్ మండలం అంకాపూర్‌తో పాటు ఆర్మూర్ ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాల్లో చెమటోడ్చే మహిళ రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలో ప్రధానంగా వ్యవసాయ పనులను బాధ్యతగా నిర్వహించడంలో మహిళ రైతులదే ప్రధాన పాత్రగా చెప్పవచ్చు. విత్తనం విత్తడం దగ్గరి నుంచి కలుపు తీయడం, సాగు నీరందించడం, ఎరువులు వేయడం, కోతలు, పండిన పంటను సంచుల్లో నింపడం వరకు అన్ని ప్రధానమైన పనులు మహిళా రైతులే చూసుకుంటారు. ఇక మార్కెటింగ్ వ్యవహారాలు మాత్రం ఆయా రైతు కుటుంబాల పెద్దలు చూసుకోవడం ఇక్కడ పరిపాటి మారింది. ఈ ప్రాంత మహిళ రైతులు తమ పిల్లలను చదివించడంలో కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌తో పాటు ఈ ప్రాంతంలోని వ్యవసాయాధారిత కుటుంబాల పిల్లలు చాలా మంది ఇంజినీరింగ్‌లు పూర్తి చేసుకొని దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. వారి ఉన్నతి వెనుక నిలిచింది మాత్రం ఈ మహిళ రైతులే కావడం విశేషం.

భర్త సహకారంతో వ్యవసాయం..

అంకాపూర్‌లో ఉన్న పదెకరాల వ్యవసాయ భూమిలో నా భర్త సహకారంతో అన్ని పంటలు పండిస్తున్నాం. పొలం పనులన్నీ చక్కబెడతాను. కూరగాయలతో పాటు పండించిన పంటలను మార్కెటింగ్ చేసే బాధ్యత నా భర్త గోవింద్ గంగారెడ్డి తీసుకుంటాడు. నా భర్త అనారోగ్యం పాలైన సందర్భాల్లో సైతం మనోధైర్యంతో పంటలు పండించాను. ఇద్దరు పిల్లలు బాగా చదువుకున్నారు. కొడుకు ఇంజినీరింగ్ పూర్తయింది. బిడ్డ పెళ్లి చేశాం. వ్యవసాయంపై ఆధారపడడంతో మా కుటుంబం అన్నిరంగాల్లో స్థిరపడింది.

– అనంతలక్ష్మి, రైతు, అంకాపూర్, ఆర్మూర్ మండలం

ఆర్డీవోకు బాధితుల ఫిర్యాదు

ఆర్మూర్: ఆలూర్ మండలం ఇస్సాపల్లికి చెందిన తమ కుటుంబాన్ని మున్నూరు కాపు సంఘం పెద్దలు కుల బహిష్కరణ చేశారని విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ సుమలత ఆర్మూర్‌లో ఆర్డీవో రాజాగౌడ్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఇస్సాపల్లిలో తమకు వారసత్వంగా వచ్చిన 4ఎకరాల20 గుంటల వ్యవసాయ భూమిలో తాము 55 ఏళ్లుగా కాస్తు చేస్తున్నామని ఇటీవల అదే గ్రామానికి చెందిన సంఘం పెద్దలు ముగ్గిడి గంగాధర్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారన్నారు. తాము అంగీకరించకపోవడంతో కుల బహిష్కరణ చేసి తమ బంధువుల అంత్యక్రియల్లో పాల్గొననివ్వకుండా అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన ఆర్డీవో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని అన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు



ఆర్మూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు విధులు నిర్వహించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిశీలకురాలిగా ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. ఎస్ఎస్‌టీ అండ్ ఎఫ్ఎస్‌టీ బృందాలకు ఆర్డీవో పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, అధికారులు పాల్గొన్నారు.

బడాపహాడ్‌లో మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే



వర్ని: మండలంలోని బడాపహాడ్ పుణ్య క్షేత్రం వద్ద సర్పాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గురువారం మొక్కులు తీర్చుకున్నారు. దర్గా వద్దకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు అపజయాలను మెట్లుగా మలచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెయూ ఎన్ఎస్ఎస్ ఛీఫ్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, అధ్యాపకులు ఉమాకిరణ్, రాజేశ్, వెంకటేశ్వర్లు, అనిత పాల్గొన్నారు.

ప్రజాసేవే ఆయన పరమావధి

ఆర్మూర్: గెలుపోటములకు సంబంధం లేకుండా ప్రజా సేవే పరమావధిగా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని ఎంపీపీ పస్క నర్సయ్య పేర్కొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఆలూర్ సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీమల్లేశ్, అనూషా శ్రీనివాస్ గౌడ్, భూదేవీ భూమన్న, ఆలూరు మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్, ఉపసర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ గంగారెడ్డి, తొగరి భూషణ్, క్రాంతి, రేగుల రజనీకాంత్, జాన్సన్, కొత్తూరు సునీల్, సీబీ సురేశ్ , నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు



ఆర్మూర్ సిద్ధుల గుట్టపై వేసిన రేకుల షెడ్లు



ముప్కాల్‌లో..

ఆర్మూర్/ వేల్పూర్/ నవీపేట/ బాల్కొండ: జిల్లాలో శుక్రవారం నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి. ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో ఉన్న దత్తాశ్రమంలో నెలకొల్పిన పాదరసలింగం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. నవీపేట మండలంలోని నాళేశ్వర్‌లో ఉన్న శివాలయంలో వేములవాడ ఆలయ మాదిరిగా ఈ ఆలయంలో స్వామి వారికి భక్తులు కోడెలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఆలయానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. ముప్కాల్‌లో పడి లేచిన మర్రి చెట్టు, మెండోరా మండలంలోని పోచంపాడ్ శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

అధికారులను అడ్డుకున్న రైతులు

రెంజల్(బోధన్): తీసుకున్న అప్పులు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో 2012లో రెంజల్‌కు చెందిన కొందరు వ్యక్తులు దండిగుట్ట గ్రామానికి చెందిన పలువురు రైతుల సర్వే నంబర్లను బై సర్వే నంబర్లుగా సృష్టించి రెంజల్‌లోని బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రైతులు రుణాలు చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు రైతులకు నోటీసులు అందించారు. గురువారం స్థానిక సర్వేయర్‌తో క్షేత్రస్థాయిలో బ్యాంకు మేనేజర్‌తో పాటు ఫీల్డ్ ఆఫీసర్‌లు క్షేత్ర పర్యటనకు వెళ్లగా దండిగుట్ట రైతులు అధికారులను అడ్డుకున్నారు. సర్వేయర్ ద్వారా విచారణ చేయించగా అసలు పట్టాదారులు దండిగుట్టకు చెందిన రైతులుగా నిర్ధారణ అయింది. మేనేజర్‌తో పాటు క్షేత్ర స్థాయిలో పర్యటనకు వెళ్లిన అధికారులు తిరుగు ప్రయాణమయ్యారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రుణాలు తీసుకున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని మేనేజర్ వివరించారు.



బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

బోధన్: ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ టీఎంసీ శ్రీనివాస్ అన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించారు. మెప్మా సిబ్బంది, పొదుపు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రుద్రూర్: అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోటగిరి తహసీల్దార్ సునీత సూచించారు. కోటగిరి మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో కొత్త ఓటరు నమోదు, ఓటు ప్రాధాన్యతపై సభ్యులకు అవగాహన కల్పించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజినీ, ఐకేపీ ఏపీఎం బస్వంత్‌రావు, సీసీలు సాయిబాబా, గంగారాం, రమేశ్, రాజు, సుజాత, రమ, శ్రీదేవి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఏపీఎం కుంట గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవి, నవీన్, శ్రీనివాస్, భాగ్య, పీర్య, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెన్నయ్య గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాక్లూర్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం అనిల్‌కుమార్ అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

రైతుల రాస్తారోకో

మోర్తాడ్: మండల కేంద్రంలో నిర్మించనున్న బైపాస్ రోడ్డును వ్యవసాయ పొలాల గుండా కాకుండా ఉన్న రోడ్డునే విస్తరించాలని కోరుతూ బాధిత రైతులు జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఇప్పటికే తాము వరద కాలువ, రైల్వే లైన్‌ల నిర్మాణానికి ఎంతో విలువైన భూములను కోల్పోయామని మరోసారి తమ భూములు కోల్పోడానికి సిద్ధంగా లేమన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవిస్తానని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకోను విరమించారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు అనిల్ రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.



ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

రుద్రూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలం కారేగాం శివారులోని స్వయం భూలింగేశ్వర మహదేవుని గుట్టపై నిర్వహిస్తున్న అఖండ శివనామ సప్తాహం కార్యక్రమానికి ఎమ్మెల్యే గురువారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుని గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట హంగర్గా పారం సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

కాలువ పూడికతీత పనుల పరిశీలన

వర్ని(చందూర్): మండలంలోని మేడిపల్లి శివారులోనున్న లక్ష్మీ సాగర్ ప్రాజెక్టు కాలువ పూడికతీత పనులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. కాలువలో చెత్త, చెదారం, ఇసుక మట్టి పేరుకుపోవడంతో సాగు నీరు అందటం లేదని రైతులు తన దృష్టికి తీసుకువస్తే సుమారు రూ. రెండు లక్షల వ్యయంతో పుడికతీత పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మా ఊరి రాజారెడ్డి - 10.30 వ్యూహం (తెలుగు) - 1.00 ఊరు పేరు భైరవకోన - 3.45 ముఖ్య గమనిక (తెలుగు) - 7.00 కిక్ (తెలుగు) - 9.45
స్క్రీన్-2 –	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00 హనుమాన్ (తెలుగు) - 3.45 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05
స్క్రీన్-4 –	ఇంటి నెంబర్-13 - 10.45 చారి-111(తెలుగు) - 1.30, 7.20 భూతద్దం భాస్కర్ - 4.20, 10.10

సంక్షిప్తం

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్ని(మోస్రా): ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు, యువకులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై కృష్ణకుమార్ అన్నారు. మోస్రా మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఫోన్లు, రహస్య సమాచారాన్ని చెప్పొద్దని సూచించారు.

రేపు టీయూలో ఎస్ఎఫ్ఐ కన్వెన్షన్

బోధన్: తెయూలో ఈ నెల 9,10వ తేదీలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల కన్వెన్షన్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కార్యదర్శి సాయి కుమార్ తెలిపారు. పట్టణ కేంద్రంలో కన్వెన్షన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఉషోదయ విద్యా సంస్థల డైరెక్టర్ దుష్యంత్, నాయకులు ఆవిష్కరించారు. నాయకులు పవన్, శివ, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌బాబు తొలగింపు

బోధన్: బహుజన సమాజ్ పార్టీ నుంచి అమర్‌నాథ్‌బాబును గత జనవరిలో తొలగించామని పార్టీ జిల్లా నాయకులు తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో కరపత్రాలు వేయకుండా, ప్రచారం నిర్వహించకుండా వ్యక్తిగత గొప్పతనం చెప్పుకునేందుకు క్యాడర్ మధ్య విభేదాలు సృష్టించి పార్టీని వాడుకునే ప్రయత్నం చేశాడన్నారు. ఇకపై పార్టీతో అమర్‌నాథ్‌బాబుకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి గైని గంగాధర్, జిల్లా అధ్యక్షుడు పాండు, అరుణ జ్యోతి, లావణ్య, వీణాగౌడ్, సమంత పాల్గొన్నారు.

జీరో విద్యుత్తు బిల్లులు అందజేత

వేల్పూర్: పడగల్ గ్రామంలో జీరో విద్యుత్తు బిల్లులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఆయన వెంట నాయకులు కొట్టాల చిన్నారెడ్డి, తలారిజాన్, నల్లరాజు, వసంత్ రావు, రాజేశ్, కార్యకర్తలు ఉన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

మాక్లూర్: మండలంలోని ముత్యంపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బీజేపీ నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్, మండల అధ్యక్షుడు సురేశ్‌నాయ్, సాగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో మెహంది పోటీలు

మోర్తాడ్: మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులు ఓటర్లకు అవగాహన కోసం మెహంది, రంగోళి పోటీలు గురువారం నిర్వహించారు. విజేతలకు ఏపీఎం ప్రమీల బహుమతులను అందజేశారు. సీసీలు తడకల శ్రీనివాస్, మహేందర్, శ్రీనివాస్, మోహన్, స్వప్న పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌కు చెందిన ఆర్మీ సైనికుడు సుమన్ తన తల్లిదండ్రులు పుట్టి లస్మన్న ముత్తెమ్మల జ్ఞాపకార్థంగా సిమెంట్ బెంచీలను గురువారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సుమన్‌ను అభినందించారు.

వైన్‌షాపులో దొంగతనం

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్సై విక్రమ్ తెలిపారు. దుండగులు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారని, వైన్‌షాప్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.